www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 ఆగస్టు 2023



రక్త(ణ) బీభత్సం...!



- రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు
- దాడులను నిరసిస్తూ నేడు వైసిపి బంద్‌కు పిలుపు
- చంద్రబాబు పర్యటన ఆద్యంతం బైపాస్‌లోనే..
- పోలీసులకు, టిడిపి శ్రేణులకు గాయాలు
- పలమనేరు, చిత్తూరుల్లో బాబు పర్యటన రద్దు
- నేడు రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మీదుగా...

ప్రజాశక్తి - పుంగనూరు

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చిత్తూరు జిల్లా మంత్రి పెద్దిరెడ్డి ఇలాకా పుంగనూరులో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. చంద్రబాబు బైపాస్‌లోనే వెళతారని, పట్టణంలోనికి అనుమతి లేదంటూ పోలీసులు బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో టిడిపి శ్రేణులు భారీగా మోహరించి వాగ్వివాదానికి దిగారు. దీంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ మూడు గంటల పాటు రణరంగ వాతావరణం నెలకొంది. టిడిపి శ్రేణులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడంతో వారు రాళ్లతో దాడిచేశారు. ఈ దాడిలో పలువురు పోలీసులకు, టిడిపి కార్యకర్తలకూ గాయాలయ్యాయి. భాష్పవాయువు ప్రయోగించడంతో పోలీసుల ఎస్కార్ట్ వాహనం, వజ్ర వాహనాలకు టిడిపి శ్రేణులు నిప్పు పెట్టారు. పాలసముద్రం ఎస్ఐ ప్రసాద్‌కు రక్తగాయాలయ్యాయి. గాయపడిన పోలీసులను, టిడిపి శ్రేణులను ప్రథమ చికిత్స నిమిత్తం పుంగనూరు ఆస్పత్రికి తరలించారు. ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనని జనం భయం గుప్పెట్లోనే ఇళ్లల్లో తలుపులు వేసుకునే ఉన్నారు. షాపులు మూసేశారు. దాదాపు 500 మంది పోలీసు బలగాలతో భారీగా పుంగనూరును మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, పోలీసులకు రెండు పార్టీల నాయకులు, క్యాడర్ సహకరించాలని జిల్లా ఎస్పి రిశాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దాడులను నిరసిస్తూ వైసిపి శ్రేణులు జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు.

పుంగనూరులో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా : చంద్రబాబు

పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకూ తాను అండగా, తోడుగా ఉంటానని, అందరినీ కాపాడుకుంటానని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా పుంగనూరు రూరల్ భీమ గాని పల్లి బైపాస్ రోడ్డులో శుక్రవారం బహిరంగ సభ జరిగినది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడకుండా ఉండాలని పిలుపునిచ్చారు. పిచ్చి పిచ్చి ఆటలు ఆడితే ఇది పోయే పార్టీ అని, మిమ్ములను ,మీ పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చల్లా



రామచంద్ర రెడ్డిని నిండు మనసుతో ఆశీర్వదించాలన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి అరాచకాల సృష్టించడం తప్పితే వారికి మరి ఏమి తెలియదు అన్నారు. ఆయనేమి పెద్ద పుడింగి కాదని బుద్ధి చెప్పే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ నాథ్ రెడ్డి , పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్ల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీమూకలను చంద్రబాబు రెచ్చగొట్టారు : పెద్దిరెడ్డి

పుంగనూరులో జరిగిన రణరంగంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతిలో స్పందించారు. రౌడీమూకలను



పోలీసు వాహనాలకు నిప్పు

చంద్రబాబు రెచ్చగొట్టారని, డబుల్ బ్యారెల్ గన్స్ పెట్టుకుని వచ్చారన్నారు. పద్ధతి ప్రకారం చేశారని విమర్శించారు. చంద్రబాబుపై మొదటి ముద్దాయిగా కేసు నమోదు చేయాలన్నారు. దౌర్జన్యానికి పాల్పడిన వారి వివరాలు వీడియోల్లో స్పష్టంగా ఉన్నాయన్నారు. చంద్రబాబు పుంగనూరు లోపలికి రారు, బైపాస్‌లోనే వెళతారని పత్రికా ప్రకటన ఇచ్చారని, కావాలనే పుంగనూరు లోపలికి వెళ్లి రచ్చ చేయాలని చూశారని మండిపడ్డారు. చంద్రబాబు మానసిక స్థితి సరిగ్గా లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో ఇక గెలవలేనని చంద్రబాబు డిసైడ్ అయ్యారని, మంచి డాక్టర్‌కు చూపించుకుని, ప్రజాస్వామ్య పద్ధతిల్లో ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు.

జిల్లా బంద్‌కు వైసిపి పిలుపు

చిత్తూరు అర్బన్: పుంగనూరు ఘటనల నేపథ్యంలో జిల్లా బందుకు వైసీపీ పిలుపునిచ్చింది. చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా పుంగనూరులో పోలీసులు, వైకాపా కార్యకర్తలపై దాడులను నిరసిస్తూ శనివారం బందుకు పిలుపునిస్తున్నట్లు వైకాపా జిల్లా అధ్యక్షులు భరత్ తెలిపారు. బందులో వైకాపా శ్రేణులు పాల్గొనాలని కోరారు. బందును విజయవంతం చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు నియోజకవర్గ ప్రజలను కోరారు.

దోపిడి రాజ్యాన్ని అంతమొందిద్దాం : చంద్రబాబు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర అభివృద్ధి కోసం దోపిడీ రాజ్యాన్ని అంతమొందించాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పుంగనూరు ఘర్షణల నేపథ్యంలో చిత్తూరులో నిర్వహించాల్సిన సభ రద్దు కావడంతో కాణిపాకం బైపాస్ మీదుగా పూతలపట్టు చేరుకున్న చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో రైతులు రాజధాని అమరావతి కోసం ఉచితంగా స్థలాన్ని ఇస్తే జగన్ ప్రభుత్వం రాజధానిని రాజకీయం చేస్తుందన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే అమరావతిని రాజధానిగా ప్రకటిస్తామని తెలిపారు. 10 లక్షల కోట్లు అప్పు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారో తెలపాలన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు, నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి అందిస్తామని, అలాగే అమ్మకు వందనం పేరుతో కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా ఏడాదికి 15000 రూపాయలు ఇవ్వనున్నట్లు చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని తెలుగుదేశాన్ని గెలిపిస్తే ప్రపంచంలోనే తెలుగుజాతిని అగ్రభాగంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. బహిరంగ సభలో పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జి మురళి, టిడిపి జిల్లా నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ పరిధిలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు : డిఐజి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

పుంగనూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన విధ్వంసంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అనంతపురం డిఐజి అమ్మిరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంఘటనలో పోలీసులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు నాయుడు పర్యటన పట్టణంలో లేదని ఒకవేళ పట్టణంలోకి వచ్చిన విధ్వంసకర సంఘటన పాల్పడతారని ముందస్తుగా శ్రీకష్ణదేవరాయ సర్కిల్లో పోలీసులు బ్యారికెడ్లు ఏర్పాటు చేశారని చెప్పారు. పోలీసులు చట్ట ప్రకారం వారి పనులు చేస్తున్నా వారిపై రాళ్ల వర్షం కురిపించడం దురదష్టకరమైన సంఘటన అని అన్నారు. సంఘటనలో 13 మంది పోలీసులు గాయపడ్డారని దిశ డిఎస్పికి తీవ్ర రక్తగాయాలు అయ్యాయని చెప్పారు. అలాగే ఓ కానిస్టేబుల్‌కు కన్ను పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. రెండు వాహనాలు ఈ సందర్భంగా నిప్పు అంటించారని చెప్పారు. ఈ సంఘటనలో పూర్తి వివరాలు సేకరించమని అందరిపైనా కేసులు నమోదు చేస్తామని కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విలేకరుల సమావేశంలో చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, డిఎస్పిలు సుధాకర్ రెడ్డి, రవికుమార్, ఎస్బి డి.ఎస్.పి రవికుమార్ లు పాల్గొన్నారు.



గాయాలపాలైన పోలీసులను పరామర్శిస్తున్న ఎస్పీ

పోరాడితే కేసులు పెడతారా?

ప్రజాశక్తి-చిత్తూరు: గత మూడు రోజుల కిందట అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి బలైన రెడ్డి కుటుంబాలతో కలిసి అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి కులస్తులు, బిసి, మైనార్టీ కులస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నాయకులు వెదురుకుప్పం మండలంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి పై కేసులు పెట్టి, అరెస్ట్ అయ్యేలా ఒత్తిడి తెస్తామన్నారు. ఈ చట్టం ద్వారా రెడ్లను కాపాడుకునేందుకు నరేష్ కుమార్ రెడ్డి మీడియా ద్వారా వివిధ కార్యక్రమాల ద్వారా నిరసన తెలియజేస్తున్నారు. దీని మీద అన్ని ప్రాంతాల నుంచి ఇప్పటికే నాకు ఫిర్యాదులు అందాయి, ఇలాగే వ్యవహరిస్తే అరెస్టు చేయిస్తామని మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇలా మాట్లాడడం ఎంతవరకు సమంజసం ! మీ వర్గం కోసం మీరు ఏ విధంగా పోరాడుతున్నారో రెడ్డి వర్గం కోసం రాజకీయాలకు, హెూదాలకు అతీతంగా నరేష్ కుమార్ రెడ్డి పోరాడుతున్నారు. మీరు కేసులు పెడతామంటే, అరెస్టు చేయిస్తామంటే, బెదిరే వ్యక్తి గంగలకుంట నరేష్ కుమార్ రెడ్డి కాదు. అన్యాయం గురించి మాట్లాడే హక్కు భారతీయ పౌరుడిగా, ప్రతి ఒక్కరికి ఉంటుంది అన్న విషయాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య గమనించాలి. ప్రశ్నించినంత మాత్రాన, పోరాటాలు చేసినంత మాత్రాన, అక్రమ కేసులు పెడతామంటే న్యాయస్థానాలు, పోలీసులు చూస్తూ ఊరుకోరు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర కోశాధికారి సురేందర్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బండి దామోదర్ రెడ్డి, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కామసాని బాలకష్ణ రెడ్డి, రాయలసీమ ఉపాధ్యక్షుడు బండి సంజీవరెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కామసాని దేవరాజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న రెడ్డి సంఘం నాయకులు

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా జరిగింది. ధర్నా నుద్దేశించి ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలు చేస్తున్న సందర్భంలో జిల్లాలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేయకపోగా వేతనాలను కూడా నెలలు తరబడి బకాయి పెట్టడం దుర్మార్గమన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్యాలను కాపాడటంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న పంచాయతీ కార్మికులపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేంద్ర, ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు లు మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషించిన పంచాయతీ కార్మికులను మర్చిపోవడం ఏమిటని ప్రశ్నించారు. మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ సమయంలో పారిశుధ్య కార్మికులు బాగా పనిచేస్తారని చప్పట్లు కొట్టండి అని ఉత్తుత్తి మాటలు చెప్పారు కానీ వారికి కనీస వేతనాలు అమలు చేయడంలో మాత్రం ముందుకు రాలేదని ప్రశ్నించారు. రాజకీయ వేధింపులు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయని పంచాయతీల్లో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పంచాయతీ అధికారులు స్పందించి స్థానిక సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు రామకష్ణ, గోవిందప్ప, మధు, మారెమ్మ, పొన్నుమని, సుబ్రమణ్యం, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి: యుటిఎఫ్



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ, విద్యాశాఖ అధికారుల నిర్లిప్తతతో రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతి, బదిలీ పొందిన దాదాపు 50 వేల మంది ఉపాధ్యాయులకు జీతాలు ఆగిపోయాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు చెల్లించాల్సిన ఇంటి అద్దెలు, గృహ రుణాల కంతులు, వ్యక్తిగత రుణాల కంతులు సక్రమంగా చెల్లించలేక అవస్థలు పడుతున్నారన్నారు. బ్యాంకులకు చెల్లించాల్సిన కంతులు సకాలంలో చెల్లించకపోవడంతో పెనాల్టీ కట్టాల్సి వస్తున్నదని, ఉపాధ్యాయులు బ్యాంకులో డిఫాల్టర్స్‌గా మారాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతికత అభివద్ధి చెందిన తరుణంలో క్యాడర్ స్ట్రెంత్‌ను అప్డేట్ చేయడానికి నెలల తరబడి సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం లేదన్నారు. తక్షణమే సవరించిన కేడర్ స్ట్రెంత్ ను ఆర్థిక శాఖ ఆమోదంతో రాష్ట్ర ఖజానా కార్యాలయానికి, తద్వారా 26 జిల్లాల ఖజానా కార్యాలయాలకు పంపి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని, వీరితోపాటు డిప్లాయిడ్ కింద హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు పీజీటీలుగా వెళ్లిన ఉపాధ్యాయులకు, ఎంఈఓ -2 గా వెళ్ళిన ప్రధానోపాధ్యాయులకు జీతాలు చెల్లించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. జీతాల మంజూరుకు సప్లమెంటరీ బిల్ సమర్పించే గడువును ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు రెహానా బేగం, జిల్లా కార్యదర్శులు ఏ.కష్ణ మూర్తి, రెడ్డెప్ప నాయుడు, మణిగండన్, ఏకాంబరం, ఎస్‌పి బాషా, పార్థ సారథి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో రాజకీయ ఉద్రిక్తత



అనంతపురం గ్రామంలో ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-వి.కోట: అధికార వైసీపీ ఎంపీపీ యువరాజ్.. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ మండల అధ్యక్షుడు మాజీ ఎంపీపీ భర్త రంగనాథ్ పరస్పరం మాటల తూటాలతో, సవాళ్ల ప్రతి సవాళ్లతో రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులను నెలకొల్పి మండలంలో ఎన్నికల వేడిని రాజేస్తున్నాయి. ఇటీవల పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ పలమనేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి తెలుగుదేశం పాలనలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన వి.కోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ మరుసటి రోజు పలమనేరు పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే వెంకటే గౌడ, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, వి.కోట ఎంపీపీ యువరాజ్ లు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని ప్రత్యారోపణ చేశారు. వీటితోపాటు నాయకుల వ్యక్తిగత విషయాలను ప్రస్తావించారని ఆరోపిస్తూ గత గురువారం వి.కోట ఎంపీపీ యువరాజ్ మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి నేతలతో కలిసి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత తెలుగుదేశం పాలనలో ఎంపీపీ సులోచనమ్మ రంగనాథ్ మండలంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని సొంత ఆస్తులు సమకూర్చుకునేందుకు పాటుపడారని ఆరోపించారు. వీటితోపాటు తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివృద్ధి కంటే వైసీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి ఎక్కువగా జరిగిందన్నారు. దానిని నిరూపించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో గత శుక్రవారం సాయంత్రం వరకు టీడీపీ శ్రేణులకు అవకాశం ఇస్తూ రంగనాథ్‌కు సవాల్ విసిరారు. దీనిపై స్పందించిన టీడీపీ శ్రేణులు గత శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ మాజీ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు మండల పరిషత్ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించేందుకు నిరాకరించారు. దీనితో ఆగ్రహించిన టీడీపీ నేతలు కార్యాలయం మెట్లపైనే పత్రిక సమావేశాన్ని నిర్వహించి ఎంపీపీ యువరాజ్‌ను అధికారికంగా, వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ వ్యతిరేకంగా పలు ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో ఎంపీపీ యువరాజ్, టిడిపి మండలాధ్యక్షుడు రంగనాథ్ స్వగ్రామమైన అనంతపురంలో అభివృద్ధి పనులను చేపట్టే నిమిత్తం వెళ్లడంతో విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు గ్రామానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి నేతలు కార్యకర్తలు పరస్పరం తోపులాటలకు పూనుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొల్పారు. విషయం తెలుసుకున్న సీఐ ఆశీర్వాదం, ఎస్సై మనోహర్ తమ సిబ్బందితో వెళ్లి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఇరు పార్టీల అగ్ర నేతలు సవాళ్ల ప్రతి సవాళ్లు విసురుతుండడంతో, మండల స్థాయి నేతలు వాటికి తగ్గకుండా గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులను నెలకొల్పుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పటినుండే గ్రామాల్లో ఎన్నికల వేడి రాజు కుంటోంది.



మండల పరిషత్ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశం నిర్వహిస్తున్న టిడిపి నేతలు

అట్టహాసంగా యువ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలో దాదాపు 25 రోజుల పాటు నిర్వహించనున్న యువ సైకిల్ యాత్ర శంఖారావం కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ నేతలు శుక్రవారం రామకుప్పంలో ఘనంగా ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందేందుకు యువత అందరూ దీక్ష భూని పట్టుదలతో కషిచేసి మెజార్టీ సాధించాలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు కుప్పంలో ఓడిపోతే టీడీపీ కార్యకర్తలు గ్రామాలు వదిలి వెళ్ళిపోతామని, వైసీపీ ఓడిపోతే కుప్పంను వదిలి వెళ్ళిపోతారా అంటూ సవాల్ విసిరారు.



యువ సైకిల్ యాత్రలో పాల్గొన్న టీడీపీ నేతలు

ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్‌లు మట్లాడుతూ దాదాపు 25 రోజులు పాటు కుప్పం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, గ్రామంలోని కుటుంబాలన్నిటినీ తెలుగు యువత సభ్యులు సైకిల్ యాత్ర ద్వారా కలిసి రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న అరాచక పాలనను వివరించాలన్నారు. గతంలో కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని చాటి చెప్పాలని, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌ను విజయవంతంగా ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు డాక్టర్ సురేష్ బాబు, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ రెడ్డి, నరసింహులు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునుస్వామి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

పేద రైతులకు న్యాయం చేస్తాం



తిరుమలరాజపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో సుజన

ప్రజాశక్తి-పాలసముద్రం: భూ సర్వేలో పేద రైతులకు న్యాయం చేస్తామని ఆర్డీవో సుజన అన్నారు. శుక్రవారం ఆమె టిఎన్ఆర్ పురానికి చెందిన భూములను పరిశీలించారు. ఇందులో నిజమైన రైతులను గుర్తించి ఉన్నత అధికారులకు నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. తరువాత ఆముదాల జగనన్న లేఔట్‌ను పరిశీలించారు. ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అన్నారు. తర్వాత టిఎన్ఆర్ పురం, ఎస్‌కెఆర్ పురం బర్రెల గ్రౌండ్‌కు స్థలాలు పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. తహశీల్దార్ బాబు, సర్వేయర్ కిరణ్, వీఆర్వో శీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కడప నత్తం పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు కవిత, స్నేహ, దీపిక, సుప్రియ రాష్ట్రస్థాయి అండర్ 15 క్రికెట్‌కు ఎంపికైనట్లు పాఠశాలల ఉపాధ్యాయ బృందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా బాయ్స్, గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏసీఏ తరపున గత ఆదివారం తిరుపతి దగ్గర గల తుమ్మలగుంటలోని వైఎస్సార్ గ్రౌండ్‌లో అండర్ 15 క్రికెట్ సెలక్షన్ నిర్వహించారని, ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆగస్టు 5 నుండి 7వ తేదీ వరకు తిరుపతి జిల్లాలోని వెంకటగిరి క్రీడా మైదానంలో అంతర్జాతీయ జిల్లా క్రికెట్ పోటీలు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. విద్యార్థుల ఎంపికపై పాఠశాలల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాజిపల్లెలో సచివాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ ఫలాల గురించి గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషణ అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, గ్రామాల్లో బడి మానేసిన వారిని గుర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని స్థానికంగా ఉండే గ్రామ వాలంటీర్లు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నూర్ మహమ్మద్, ఉపాధ్యాయురాలు కౌసల్య, అంగన్‌వాడీ కార్యకర్త సెల్వరాణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి టిడిపితోనే సాధ్యం



ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తున్న టీడీపీ నియోజకవర్గ నేతలు

ప్రజాశక్తి-రామకుప్పం: మహిళల ఆర్థికాభివృద్ధి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, మాజీ ఎంపీటీసీ అలివేలు మంగమ్మ, జిల్లా నేత చంద్రకళ పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పం మండల కేంద్రంలోని శివాజీ నగర్ కాలనీలో మహిళా మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తుందని, ఇందులో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా ఆర్థిక స్వావలంబన పథకాలు, సామాజిక భద్రత, ఉద్యోగ అవకాశాలు బాబుతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు వసంతమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు పద్మమ్మ, తిరుపతమ్మ, రాణమ్మ, సుబ్బమ్మ, సుజాత, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద పీట



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం రూ.10 లక్షతో మంజూరు చేసిన అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి దళితవాడలోను విరివిగా హిందూ ఆలయాలు నిర్మాణాలు చేపట్టాలనే ఉద్దేశ్యంతో టీటీడీ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళిత వాడలను పట్టించుకున్న వాపాన పోలేదని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మోసం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్, మాజీ సర్పంచ్ అంకయ్య, జేజేలురెడ్డి, శ్రీనివాసులు, శేషాద్రి, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పత్రీజీ మహిళా చైతన్యం సదస్సును జయప్రదం చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక రోటరీ క్లబ్ వేదికగా శ్రీకాళహస్తి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ మూమెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న 'పత్రీజీ మహిళా చైతన్యం' సదస్సును జయప్రదం చేయాలని పిరమిడ్ మాస్టర్లు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ మూమెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్లు శివాజీ, గురుస్వామి నాయుడు, శివ మాట్లాడుతూ మహిళా చైతన్యం, శాఖహారం, ధ్యానం ఆవశ్యకతలపై బ్రహ్మర్షి పితామహ పత్రీజీ 18 ఆదర్శ సూత్రాలను ఉపదేశించారని చెప్పారు. ఈ 18 ఆదర్శ సూత్రాలపై 5, 6 తేదీలలో జరగబోయే సదస్సులో వక్తలు ప్రజలనుద్దేశించి అవగాహన కల్పిస్తారని చెప్పారు. ధ్యానం, శాఖాహారంతో కలిగే ప్రయోజనాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, పత్రీజీ మహిళా చైతన్య సద స్సును పిరమిడ్ మాస్టర్లు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో పాల్గొనే వారికి భోజన వసతి కల్పించామని తెలిపారు. వివరాలకు సెల్: 8688616080, 9032761180, 9989244426, 7674950135 నంబర్లను సంప్రదించాన్నారు. పిరమిడ్ మాస్టర్లు రమ్య, మీర్జా పాల్గొన్నారు.

దళిత రిజర్వేషన్లను కాలరాస్తున్నారు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదల సొమ్మును కాజేసేందుకు కొందరు అగ్ర కులస్తులు దొడ్డిదారిలో దళితులుగా చలామణి అవుతూ ఎస్సీ రిజర్వేషన్లను కాలరాస్తున్నారని జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ అన్నారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులి శ్రీకాంత్ శుక్రవారం స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. కొందరు అగ్ర కులస్తులు తాము ఎస్సీలమని చెప్పుకుంటూ దళితుల రిజర్వేషన్లకు గండి కొడుతున్నట్లు వాపోయారు. అందుకు గుంటకిందపల్లి దళితుల భూ వివాదం సంఘటనే నిదర్శనమని ఉదహరించారు. తాను బీసీ కులానికి చెందిన వ్యక్తినని చెప్పుకున్న వెంకటేష్ ఆచారి ఆయన తండ్రి, మొదటి భార్యపై ఎస్సీ సామాజిక వర్గం తరపున పట్టాదారు పాస్ పుస్తకాలు ఎలా తయారు చేయించాడని ప్రశ్నించారు. రెండో భార్య ఎస్సి కులానికి చెందిన వారని చెబుతున్నా, ఆమెకు పుట్టిన పిల్లలు ఎలా ఎస్సీలవుతారని మండిపడ్డారు. దళితుల సామాజిక అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. అయితే కొందరు స్వార్ధపరులు దొడ్డిదారిలో దళితులుగా చలామణి అవుతూ ఎస్సీ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటకిందపల్లి భూవివాదంలో అగ్ర కులస్తులను ఎస్సీలుగా చేర్చి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేంతవరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఆడికృత్తిక ఉత్సవాలను విజయవంతం చేయాలి



ప్రజాశక్తి-పాకాల: సమిష్టి కృషితో ఆడి కృత్తిక ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం చుట్టూ తక్కువగా స్థలం ఉన్నందున ఎంతటి వారినైనా వాహనాలతో లోనికి అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆలయం వద్దకు వచ్చే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు అందుబాటులో ఉండి భక్తులకు వైద్య సదుపాయాలు కల్పించాలని, భక్తులకు తాగు నీరు, మరుగుదొడ్లు, తలనీలాలు సమర్పించే ప్రాంతాల్లో స్నానం కోసం సరిపడ నీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యం



ప్రజాశక్తి -సత్యవేడు: సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకొస్తున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడానికి క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాసుకుప్పం, మదనంజేరి గ్రామంలో మృతి చెందిన పశువులకు బీమా సొమ్ము మంజూరు కాలేదని సర్పంచులు రవి, రెడ్డి, బాలాజీ విన్నవించారు. 104 వాహన సర్వీస్ రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పెద్దఈటిపాకం సర్పంచ్ రూబెన్ వాపోయారు. కార్యక్రమంలో జడ్పిటిసి విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు సరోజిని, వెంకటరత్నమ్మ, కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, మండల వ్యవసాయ సలహా ఛైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఆటోనగర్ స్థల పరిశీలన



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో ఆటోనగర్, ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు. గాంధీనగర్ ప్రాంతంలో ఆటోనగర్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని శుక్రవారం గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఇండస్ట్రియల్ ఏడీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో అన్ని మౌలిక వసతులతో కూడిన ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని.. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ సి.ఈ.సి సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు మీరా రెడ్డి, నాసిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, సుబ్బానాయుడు, జె.సి.ఎస్ కన్వీనర్ శ్రీహరి, కొట్టు గోవర్ధన్, అన్నం మురళి, అల్తాఫ్, ఆటో నగర్ యూనియన్ అధ్యక్షులు బాషా తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడులోని ప్రగతి భవనంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ఐసిడిఎస్ ప్రాజెక్టు-రేణిగుంట ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, సీడీపీవో కష్ణమంజరి, హెల్త్ సూపర్వైజర్ కళావతి, ఏర్పేడు సర్పంచ్ శివయ్య, సూపర్వైజర్ రత్నమ్మ, అంగన్వాడీలు, పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని బుగ్గవీధి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ నగేషం, ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ, వైస్ ఎంపీపీ సుజాత పాల్గొని వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డికి రాష్ట్రస్థాయి పురస్కారం

ప్రజాశక్తి పెళ్లకూరు: విజయవాడలో నిర్వహించిన సహకార బ్యాంక్ ఆప్కాబ్ 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా సీఈఓ శంకర్ బాబు తో కలిసి అవార్డుతో పాటు ప్రశాంత పత్రాన్ని నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అందుకున్నారు. జిల్లాలోని రైతులకు డీసీసీబీ ద్వారా సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని బ్యాంకు పరిధిలో గల సంఘాలను లాభల బాటలో నడిపిస్తూ వాణిజ్య బ్యాంకులకు ధీటుగా రుణాలు అందిస్తున్నట్లు ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

నేడు తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు వేలం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: శ్రీ ద్రౌపది దేవి సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక స్టాల్స్, దుకాణాల ఏర్పాటుకు 5వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు పుత్తూరు పురపాలక సంఘ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎంఎన్ రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఫ్యాన్ల వితరణ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 10 ఫ్యాన్లును శుక్రవారం అందించారు. క్లబ్ అధ్యక్షులు రామకష్ణ స్వరూప్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్, సెక్రెటరీ శ్రావణ్ కుమార్, దశరథ రామిరెడ్డి, పీడీజీ మునిగిరీష్ , పి.వి. క్రిష్ణయ్య, శ్రీధర్ రెడ్డి, బి.రాంప్రసాద్ బాలకష్ణం రాజు, జగదీశ్ నాయుడు, కిరణ్ చక్రవర్తి, రవికుమార్, శ్రీధర్ నాయుడు, బలరాంరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సందీప్ డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ఎంపికైన మహమ్మద్ హాఫీస

ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని సాయి చరణ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న మహమ్మద్ హాఫీస ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీలో 600 గాను 592 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ షేక్ మహమ్మద్ అంజాద్ తెలిపారు. శుక్రవారం ఫేస్ టు ఫలితాలలో తమ పాఠ శాల విద్యార్థిని ఉత్తమమైన మార్కులు సాధించి సీటు సంపాదించడం హర్షణీయమని కరస్పాండెంట్ తెలిపారు.

చాఫ్ కట్టర్‌ల పంపిణీ



చాఫ్ కట్టర్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని వెటర్నరీ హాస్పిటల్ ప్రాంగణంలో డాక్టర్ వెంకట సాయి ఆధ్వర్యంలో డిసిసిబి బ్యాంక్ ఛైర్మన్ రెడ్డమ్మ కష్ణమూర్తి తనయులు రెడ్డి వీనస్, శైలేష్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ కొమ్ము వెంకటేష్ అధ్యక్షతన పాడి రైతులకు చాఫ్ కట్టర్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చాఫ్ కట్టర్‌లను మార్కెట్లో రూ.33,970 ఉండగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.13,588 పోగా, రూ.20,382 లకు ప్రభుత్వం అందిస్తుండటంతో అధిక సంఖ్యలో పాడి రైతులు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ వెంకట సాయి, కాంపౌండర్ మంగమ్మ, వైస్ సర్పంచ్ కబ్రాజ్ భాష, మండలంలోని పాడి రైతులు పాల్గొన్నారు.

లక్ష మెజార్టీయే లక్ష్యం



సైకిల్ యాత్రలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షులు, నేతలు

ప్రజాశక్తి-గుడిపల్లి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కుప్పం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా లక్ష మెజార్టీ లక్ష్యంగా కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో తెలుగు యువత ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నాలుగు రోజులు నిర్వహించడంలో భాగంగా ఈ కార్యక్రమానికి టిడిపి గుడుపల్లి మండల పార్టీ అధ్యక్షులు టి.ఎం.బాబు నాయుడు ఆధ్వర్యంలో వారికి మద్దతుగా శుక్రవారం సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుడిపల్లి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ హేమాంబర్ గౌడు, దళిత నాయకుడు సుబ్రమణి, మాజీ జడ్పిటిసి బేటప్ప నాయుడు, మాజీ ఎంపీపీ మునిరాజు, మాజీ ఎంపిటిసి ఉదయ్ కుమార్, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బదిలీ ఉపాధ్యాయులను గుర్తించడం మనందరి బాధ్యతని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాగిమాను పెంట సిఆర్‌సి పరిధిలోని బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం సిఆర్‌సి కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర రావు, రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీ సహజమని, పనిచేస్తున్న సమయంలో గుర్తింపు పొందాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్, రవీంద్ర, ప్రసాద్, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఆడి కృత్తిక మహోత్సవాలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రానికి సమీపంలోని నరివేపానికొండపై 39వ ఆడికత్తిక మహోత్సవాలను ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా బంగారు తిరుత్తని కొండపై విద్యుత్ దీపాల ఏర్పాటు, వినాయక స్వామి ఆలయం వద్ద భక్తులకు వసతి, తాగునీరును నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

కౌన్సిల్ సమావేశానికి హాజరుకండి

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఈనెల 21, 22వ తేదీలలో విజయవాడలో జరిగే ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని కొత్తూరు తాలూకా అధ్యక్షులు టి.గిరిప్రసాద్, కార్యదర్శి ఇ.శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ టి.కష్ణ లు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్వేటినగరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను తహశీల్దార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

6న దేవేంద్రాచారికి పురస్కారం

ప్రజాశక్తి-పలమనేరు: ఈనెల 6వ తేదీన ఉదయం 10.00 గంటలకు గంగవరం, సాయి గార్డెన్ సిటీలోని కళామందిరంలో జరిగే సాహిత్య సభలో ప్రముఖ రచయిత సుంకోజి దేవేంద్రాచారికి స్థానిక రచయిత పలమనేరు బాలాజీ తన తల్లి కే.యన్.జయమ్మ జ్ఞాపకార్థం కే.ఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని, రూ.25 వేల నగదు అందజేస్తున్నారని తెలుగు సాహిత్య సంస్కృతిక అధ్యక్షులు పి తులసినాధం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమానికి కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగుల వారి పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ రెడ్డప్ప పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గండికోట రాజా, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలోనైనా పోటీ చేస్తా

ప్రజాశక్తి-పలమనేరు: పుంగనూరులో కాదు అధిష్టానం ఆదేశిస్తే పులివెందులలోనైనా పోటీకి అమరనాథ రెడ్డి రెడీ అని పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొంతమంది వైసీపీ నేతలు విజ్ఞత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఇది తగదన్నారు. అధికారంలో ఉన్నవారు జవాబుదారితనంతో హుందాగా వ్యవహరించాలని, ప్రతిపక్షంగా ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది అన్నారు. సమావేశంలో నాయకులు ఆర్‌బిసి కుట్టి, నాగరాజు రెడ్డి, గిరిబాబు, ఖాజాపీర్, సుబ్రమణ్యం గౌడు, నాగరాజు, మదన్, శ్రీధర్, లోకేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణ, రూరల్ మండలంలో ఈనెల వరకు జరుగు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్ జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పలమనేరు మున్సిపాలిటీలో పలమనేరు రూరల్ మండలం, పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని ఏఎన్ఎంలకు మండల్ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు మండల అభివద్ధి అధికారి మండల తహశీల్దారు, మండల వైద్యాధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కమిషనర్, ఐసిడిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పిల్లల్లో ఎదుగుదలకు అవరోధంగా మారుతున్న నులిపురుగుల నివారణకు కృషి చేయాలని తహశీల్దార్ లోకేశ్వరరావు, ఎంపీడీవో భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 10వ తేదీ జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పెద్దపంజాణి, రాయల్ పేట ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకొని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఎంపీడీవో సూచించారు. స్థానిక వైద్యాధికారులు మురళీకృష్ణ, మురళి, రాయల్ పేట వైద్యాధికారిణి నందిని, గోపాలరెడ్డి, సిహెచ్ఓ కరుణాకర్, ఎంపీహెచ్వో శీను పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: నులిపురుగుల నివారణకు ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని తహశీల్దార్ ఇన్బనాధన్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓ, పీహెచ్‌సీ డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, పీహెచ్‌సీలు డాక్టర్లు షర్మిల, ప్రశాంత్, సీహెచ్ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ధర్మేంద్ర పాల్గొన్నారు.

రాజులకండ్రిగ గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం రాజులకండ్రిగ గ్రామంలో శుక్రవారం సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన ముఖద్వారం నిర్మాణాన్ని ముద్దులూరు రామచంద్రరాజు ప్రారంభించారు. ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంతో ముఖద్వారం నిర్మించారు. గ్రామస్థులు రామచంద్రరాజును ఘనంగా సన్మానించారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కడివేటి వరలక్ష్మి మూడో వర్ధంతిని పురస్కరించుకొని దామోదయ సమితి, గ్రామోదయ సమితి, షి సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని ప్రధాన కూడలిలో అన్నదానం చేసినట్లు ఎన్. దొరస్వామి తెలిపారు. గ్రాసం సంస్థ మేనేజర్ దొరస్వామి, డాక్టర్ కడివేటి మునిరత్నం మాట్లాడుతూ నిరాదరణకు గురైన వద్ధులు, మహిళలు, పిల్లలకు ఆకలి తీర్చాలని ఉద్దేశంతో 300 మందికి అన్న వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తేజరాణి, కిశోర్‌బాబు, ధీరజ్ శ్యామ్, విహస్, రోషిని, యస్విత, గ్రాసం సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వీఆర్ఏ సమస్యల పరిష్కారానికై ఈనెల 7, 8 తేదీల్లో తిరుపతి కలెక్టరేట్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పుత్తూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు గురవయ్య, దళిత, గిరిజన సంఘం కార్యదర్శి నందయ్య, వీఆర్ఏలు చంగల్ రాయలు, భాస్కర్, పరందాం, మూర్తి, చంద్రరాయలు తదితరులు పాల్గొన్నారు.

'ఏ ధైర్యంతో అధికారులు తప్పులు చేస్తున్నారు'

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అఖిలపక్ష సమావేశానికి తెలుగుదేశం పార్టీ తరపున చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి హాజరయ్యారు. ఓటర్ జాబితాలో అంతులేని ఎన్నో తప్పులు, అవకతవకలు జరిగాయని తప్పునుల ప్రశ్నిస్తే జవాబు లేదని.. అధికారులు ఏ ధైర్యంతో తప్పులు చేస్తున్నారోనని తెలిపారు.

వైసీపీ పాలనలో మహిళాభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ పాలనలో మహిళల ఆర్థిక స్థితి అగమ్యగోచరంగా మారిందని చిత్తూరు పార్లమెంటరీ మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నాగరత్నం పేర్కొన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ-మహాశక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో గోపాలకష్టాపురం, సిరుగురాజుపాళెం పంచాయతీల్లో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ వ్యతిరేక విధానాల గురించి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవిలాల చెరువు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. అవిలాల చెరువు వద్ద 35-40 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా భావించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.